# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :269 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: బుధవారం 07-01-2026 | పేజీలు:4 వెల: 2.00


## జలప్రవేశం చేసిన సముద్ర ప్రతాప్' నౌక

పనాజీ,సముద్ర జలాల్లో కాలుష్యాన్ని నియంత్రించే అధునాతన సాంకేతికతతో దేశీయంగా తయారు చేసిన 'సముద్ర ప్రతాప్' నౌకను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జలప్రవేశం చేయించారు. గోవా షిప్‌యార్డులో సోమవారం నాడు ఈ కార్యక్రమం జరిగింది. 114 మీటర్ల హైబ్రిడ్ పొల్యూషన్ కంట్రోల్ నౌకను ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా గోవా షిప్‌యార్ట్ లిమిటెడ్ నిర్మించింది. సముద్ర జలాల్లో కాలుష్యాన్ని, ముఖ్యంగా చమురు వ్యర్థాలను నిర్మూలించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం ఇందులో ఉంది. ఇందులో 60 శాతానికి పైగా స్వదేశీ పరికరాలను వినియోగించారు. మారిటైం సవాళ్లను ఎదుర్కొనే రీతిలో సముద్ర ప్రతాప్ యుద్ధ నౌకను తయారు చేసినట్టు రాజ్‌నాథ్ సింగ్ ఈ సందర్భంగా తెలిపారు. మారిటైం పొల్యూషన్, ఫైర్ ఫైటింగ్, సముద్ర, పర్యావరణ రక్షణతోపాటు కోస్తా తీరప్రాంతాల్లో పెట్రోలింగ్ సైతం నిర్వహిస్తుందన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కొంటున్న తరుణంలో మెరైన్ బయోడైవర్సిటీని పరిరక్షించడం మన నైతిక బాధ్యత అని అన్నారు. భవిష్యత్తులో తయారు చేసే నౌకల్లో 90 శాతం స్వదేశీ సాంకేతికతను వాడేలా ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

## పాలమూరు మళ్లీ దివాలా తీసేలా కుట్రలు చేస్తున్నారు..



హైదరాబాద్, ఉమ్మడి ఏపీలో అత్యంత నష్టపోయిన జిల్లా పాలమూరు జిల్లా అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పాలమూరు జిల్లాను మంత్రులు ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. ఆస్తులు కూడబెట్టుకున్నారు తప్ప రైతులను ఆదుకోలేదని విమర్శించారు. పాలమూరులో పడావు పడ్డ ప్రాజెక్టులపై గులాబీ పార్టీ సమరభేరీ మోగించింది. ఈ క్రమంలో జూరాల ప్రాజెక్టును మాజీ మంత్రులు నింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మరెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం సందర్శించింది. నార్లపూర్ పంప్‌హౌజ్, రిజర్వాయర్, వట్టెం పంప్‌హౌజ్, కరివెన రిజర్వాయర్లను సందర్శించారు. ప్రాజెక్టులను పడావు పెట్టిన ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీలో రెండు ట్రిబ్యునల్‌లు ఏర్పాటైనా పాలమూరును పట్టించుకోలేదని అన్నారు. జూరాల ప్రాజెక్టు మొత్తం ఎండిపోతుందని శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగి పంటలకు జూరాల ఆయకట్టుకు క్రాప్ హాలీడే ఇచ్చారని తెలిపారు. ఈ జూరాల నుంచి 70 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తారా అని ప్రశ్నించారు. ఇదేం ప్రభుత్వం? అసలు నీళ్ల మీద సోయి ఉందా అని నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును 90 శాతం పూర్తి చేసుకున్నామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తట్టెడు మన్ను తీయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తారా అని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. పాలమూరు మళ్లీ దివాలా తీసేలా కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. పాలమూరును సస్యశ్యామలం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. రాజకీయ కోణంలో చూడకుండా పాలమూరు బాగు చేయాలని సూచించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ 45 టీఎంసీలకు ఒప్పుకోమని తెలిపారు. మా పాలమూరు జిల్లాకు కేటాయించిన నీళ్లు మాకు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అప్పుడు మీరిచ్చిన నీళ్ల కంటే డబుల్ నీళ్లను కేటాయించుకుంటామని తెలిపారు.

## కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అట్టర్ ఫ్లాప్ అవుతుంది.. లక్ష్మారెడ్డి ధ్వజం

హైదరాబాద్,యాసంగిలో జూరాల ప్రాజెక్టు కింద ఆయకట్టుకు క్రాప్ హాలీ డే ఇచ్చారని మాజీ మంత్రి లక్ష్మరెడ్డి గుర్తుచేశారు. క్రాప్ హాలీడే ఇచ్చిన ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎత్తిపోస్తారా అని ప్రశ్నించారు. జూరాల నుంచి నీళ్లు ఎత్తిపోయడం అసాధ్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలు మళ్లీ తొండి మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ నేతలు అజ్ఞానంతో మాట్లాడటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. బూత్‌పూర్ రిజర్వాయర్ నుంచి నీటిని ఎలా ఎత్తిపోస్తారని ప్రశ్నించారు.పాలమూరులో పడావు పడ్డ ప్రాజెక్టులపై గులాబీ పార్టీ సమరభేరీ మోగించింది. ఈ క్రమంలో జూరాల ప్రాజెక్టును మాజీ మంత్రులు నింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మరెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం సందర్శించింది. నార్లపూర్ పంప్‌హౌజ్, రిజర్వాయర్, వట్టెం పంప్‌హౌజ్, కరివెన రిజర్వాయర్లను సందర్శించారు. ప్రాజెక్టులను పడావు పెట్టిన ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి లక్ష్మరెడ్డి మాట్లాడుతూ.. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అట్టర్ ఫ్లాప్ అవుతుందని విమర్శించారు. కొడంగల్ లిఫ్ట్‌తో ప్రజాధనం కచ్చితంగా వృథ అవుతుందని అన్నారు. కేసీఆర్ గొప్పగా ప్రాజెక్టు డిజైన్ చేస్తే.. దాన్ని పడావు పెట్టారని మండిపడ్డారు. కాల్వలకు టెండర్లు పిలిచి పూర్తి చేస్తే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలకు నీళ్లు వస్తాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అవగాహన లేకుంటే నిపుణులతో మాట్లాడి తెలుసుకోవాలని సూచించారు.మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇచ్చి కమీషన్లు దండుకున్న ఘనత కాంగ్రెస్ పాలకులదే అని లక్ష్మరెడ్డి విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు 90 శాతం



పూర్తయ్యాయని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చి ఉంటే ఆరు నెలల్లోనే పాలమూరు ప్రాజెక్టు పూర్తయ్యేదని అన్నారు. ప్రాజెక్టులు పూర్తి చేయకుండా నోటికొచ్చిన అబద్ధాలు మాట్లాడుతున్నారని లక్ష్మరెడ్డి మండిపడ్డారు. చంద్రబాబుకు చెప్పి రాయలసీమ ప్రాజెక్టును ఆపించానని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి అంటే.. ఆ వ్యాఖ్యలను ఏపీ ప్రభుత్వం తీవ్రంగా ఖండించిందని తెలిపారు. జూరాల నుంచి పాలమూరు లిఫ్ట్ పెడితే ఒక్క చుక్క నీరు కూడా రాదని పేర్కొన్నారు. ఎన్ని రోజులు పంపింగ్ చేసినా లాభం ఉండదని అన్నారు. మహబూబ్ నగర్ జిల్లాను ఎడారిగా మార్చే ఆలోచనలు చేస్తున్నారని అన్నారు. దీనిపై ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎందుకు ఈ ప్రాజెక్టు గురించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడలేదని ప్రశ్నించారు.

## జామ్‌నగర్ రిఫైనరీకి రష్యా చమురు కార్గోలు.. ఖండించిన రిలయన్స్ ఇండస్ట్రీస్

జామ్‌నగర్: గుజరాత్‌లోని జామ్‌నగర్ రిఫైనరీ కి రష్యా నుంచి చమురు (Russian Oil) కార్గోలు వస్తున్నాయంటూ తెగ ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ ప్రచారంపై రిలయన్స్ ఇండస్ట్రీస్ (Reliance Industries) స్పందించింది. జామ్‌నగర్ రిఫైనరీకి రష్యా చమురు కార్గోలు అంటూ మీడియాలో వస్తున్న వార్తలను ఖండించింది. 'రష్యన్ చమురుతో నిండిన మూడు నౌకలు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు చెందిన జామ్‌నగర్ శుద్ధి కర్మాగారానికి వెళు న్నాయి' అంటూ బ్లూమ్‌బర్గ్‌లో వచ్చిన వార్తలు అవాస్తవమని స్పష్టం చేసింది.'రష్యా చమురుతో ఉన్న మూడు నౌకలు రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన జామ్‌నగర్ రిఫైనరీకి బయల్దేరాయంటూ బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. అది అవాస్తవం. అందులో ఎలాంటి నిజం లేదు. గత 3 వారాల్లో జామ్‌నగర్ రిఫైనరీకి ఎలాంటి రష్యన్ చమురు కార్గోలు రాలేదు. జనవరిలోనూ రష్యా చమురు డెలివరీలను మేం ఆశించడం లేదు. పారదర్శక జర్నలిజం చేస్తున్నామని చెప్పుకునే బ్లూబర్గ్.. మా సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా తప్పుడు కథనాలు రాయడం బాధాకరం' అని రిలయన్స్ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. 1999 డిసెంబర్ 28న రిలయన్స్ జామ్ నగర్ రిఫైనరీ స్థాపించారు. ప్రారంభంలో




దీని భవిష్యత్ మీద పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతుల్లేవని అంతర్జాతీయ నిపుణులు పెదవి విరిచారు. కానీ, రిలయన్స్ ఫౌండర్ ధీరూభాయ్ అంబానీ ఆ అనుమానాలను కొట్టిపారేస్తూ కేవలం 33 నెలల్లోనే రిఫైనరీ నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం ఇది ప్రపంచంలోనే అతిపెద్ద రిఫైనింగ్ హబ్‌గా ఎదిగింది. భారత ఇంధన సరఫరా, ఎగుమతుల్లో ఈ రిఫైనరీ కీలక పాత్ర పోషిస్తోంది.

## ఏం కోల్పోయామో అర్థమైతే కాంగ్రెస్‌ను ప్రజలు ఎప్పటికీ క్షమించరు



హైదరాబాద్,పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం 10 శాతం పనులను పూర్తిచేస్తే నీళ్లను వాడుకోవచ్చని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు కొత్త ప్రాజెక్టు కడితే ఎప్పటికి పూర్తవుతుందని ప్రశ్నించారు. రూ.32 వేల కోట్ల పనులు బీఆర్ఎస్ పూర్తి చేసిందని తెలిపారు. రూ.27 వేల కోట్ల బిల్లులు చెల్లించామని పేర్కొన్నారు. కేసీఆర్ వచ్చాక తెలంగాణ నీటి లభ్యత గురించి తెలియజేశారని అన్నారు. ముందే అప్రమత్తమైతే తెలంగాణ నీటి వాటాను కోల్పోయేది కాదని అభిప్రాయపడ్డారు.పాలమూరులో పడావు పడ్డ ప్రాజెక్టులపై గులాబీ పార్టీ సమరభేరీ మోగించింది. ఈ క్రమంలో జూరాల ప్రాజెక్టును మాజీ మంత్రులు నింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, లక్ష్మరెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌లతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం సందర్శించింది. నార్లపూర్ పంప్‌హౌజ్, రిజర్వాయర్, వట్టెం పంప్‌హౌజ్, కరివెన రిజర్వాయర్లను సందర్శించారు. ప్రాజెక్టులను పడావు పెట్టిన ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. జూరాలకు సరాసరి 25 రోజులు వరద వస్తుందని అన్నారు. జూరాల ప్రాజెక్టు కడితే తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. 3 లక్షల పైచిలుకు జనం ముంపునకు గురవుతారని పేర్కొన్నారు. ఇంత చేసినా జూరాల వద్ద నీళ్లుండవని చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తయి అన్ని రిజర్వాయర్లను నింపితే 68 టీఎంసీల నీళ్లు వస్తాయని తెలిపారు. అవసరమైతే మళ్లీ నీళ్లను నింపుకోవచ్చని అన్నారు. దీనివల్ల ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. తెలంగాణ నీళ్లను వాడుకుంటే ఇబ్బందని జూరాల ప్రాజెక్టు తీసుకొచ్చారని మండిపడ్డారు.జూరాల ప్రాజెక్టును కాంగ్రెస్ నాయకులు 40 ఏళ్ల నుంచి ప్రజలకు చూపిస్తున్నారని నిరంజన్ రెడ్డి తెలిపారు. జూరాల నుంచి నీళ్లు తీసుకోవడం అంటే పాలమూరుకు నీళ్లు వద్దని చెప్పడమే అని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మంచిని తక్కువ చేసి చూపించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఏం కోల్పోయామో అర్థమైతే ఎప్పటికీ మిమ్మల్ని క్షమించరని హెచ్చరించారు. చరిత్రలో కాంగ్రెస్‌కు స్థానమే ఉండదని.. ఎప్పటికైనా చరిత్రలో నిలిచేది కేసీఆరే అని స్పష్టం చేశారు. దొంగ మాటలు, మోసాలతో ప్రజలను ముంచాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి జీవో 24ను ఒకసారి చదువుకోవాలని సూచించారు. ఏపీ ట్రాప్‌లో కాంగ్రెస్ నేతలు పడిపోవద్దన్నారు.

## డాక్టర్ పరమట నరసింహమూర్తి గ్రామానికే ఆదర్శం : ఆనందరావు



అల్లవరం :ఈరోజు తుమ్మలపల్లి గ్రామంలో ఆరోగ్యం కేంద్రం నిర్మాణానికి స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు గారు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ గ్రామానికి ఎన్నో నిధులు మంజూరు చేస్తున్నామని ఇప్పటికే కొన్ని నిధులు మంజూరు అయ్యాయని అందులో భాగంగానే ఈ వెల్ నెస్ సెంటర్ కు సుమారు 37 లక్షలు మంజూరు అయ్యాయని రేపటినుండి పనులు ప్రారంభం అయ్యి మార్చ్ ఆఖరుకు ప్రారంభించేలా కాంట్రాక్టర్ కు సూచించామని తెలిపారు.గ్రామంలో ఈ సెంటర్ కు డాక్టర్ గారు తన సొంత స్థలాన్నే కాకుండా అయన సోదరులు అయినా పరమట విష్ణుమూర్తి, పరమట రామారావు, పరమట కాళిదాసు ల స్థలాన్ని ఒక సుమారు 5.1/2 సెంట్లు స్థలాన్ని కొనుగోలు చేసి గ్రామానికి ఇవ్వటం చాలా మంచి పరిణామం అని ఇలాంటి కార్యక్రమం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం అని కొనియాడారు. డాక్టర్ గారించి నేను విన్నానని అయన ప్రతియేటా కొన్ని లక్షలు వెచ్చించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేసారని గ్రామ ప్రజలు ఆయనకు ఎంతో రుణపడి వున్నారని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రధాన రహదారి అయిన మర్రిచెరువు కు వెళ్లే సి సి రోడ్డు కు ఇరువైపులా బెర్మ్ (మట్టితో కప్పాలని ) అలానే మర్రి చెరువు సుందరికరణ కోసం నిధులు మంజూరు చేయాలని ఇంజనీర్వ వడ్డి వెంకటేశ్వరరావు, వడ్డి ఎలీషా రాజు లు వినతి పత్రాన్ని ఎమ్మెల్యే గారు పరిశీలించి సానుకూలంగా స్పందించి వెంటనే వున్న ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ రాజ్ కుమార్ గారికి ఎస్టిమేషన్ కోసం ఆదేశించటం జరిగింది.. ఈ కార్యక్రమంలో స్థానిక జెడ్పిటీసీ కొనుకు గౌతమి, ఎంపిటీసీ పులుసుగంటి రాజేశ్వరి,గ్రామ సర్పంచ్ వడ్డి సుభాషిణి, కాట్రూ శాంతికిరణ్,వుల్లూరి గంగాధర్, మచ్చా సత్యనారాయణ, చైర్మన్ అల్లాడి స్వామినాయుడు, యలమంచిలి రమేష్ బాబు,మాకే లోకేష్ బాబు, పులుసుగంటి ప్రసాదరావు, పులుసుగంటి గంగయ్య, పంచాయితీరాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజ్ కుమార్, బొల్లం ఆదినారాయణ, పరమట సురేష్ అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు

## అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ప్రకటన

హైదరాబాద్,సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సింగరేణి పరిధిలోని ప్రాంతీయ ఆసుపత్రుల్లో పెండింగ్‌లో ఉన్న వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పోస్టులను రాబోయే 2026 మార్చి నాటికి పూర్తిగా భర్తీ చేస్తామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు.అసెంబ్లీలో సింగరేణిపై జరిగిన చర్చ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నకు భట్టివిక్రమార్క సమాధానం ఇచ్చారు.తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద పబ్లిక్ సెక్టార్ సింగరేణి సంస్థని వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ఈ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులతో పాటు ప్రజాప్రతినిధులపై అందరిపై ఉందన్నారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ సవాళ్ల మధ్య సింగరేణి సంస్థ మనుగడను



కాపాడుకోవడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## 'ఎలాగైనా గొడవ చేయాలనే.. బీజేపీ, ఎంఐఎం ఎన్నికల డ్రామాలు'

నిజామాబాద్: బీజేపీ, ఎంఐఎంలు ఎన్నికల డ్రామాలు చేస్తున్నాయని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. సోమవారం ఎన్నికల ముసాయిదాపై సందేహాలు పరిష్కరించడానికి మున్సిపల్ కమిషనర్ అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ప్రతి పార్టీ నుండి ఇద్దరు ప్రతినిధులు మించకుండా రావాల్సి ఉండగా.. ఎలాగైనా గొడవ చేయాలని ముందే ప్రణాళిక వేసుకున్న బీజేపీ, ఎంఐఎం నాయకులు తమ కార్యకర్తలతో కలిసి అధిక సంఖ్యలో రావడం జరిగిందని తెలిపారు.ఇందులో భాగంగానే ముసాయిదా సందేహాలపై సమావేశం జరుగుతున్న సమయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎంఐఎం నాయకులను కావాలని రెచ్చగొట్టే విధంగా ఇందూరు కార్పొరేషన్ అని మాట్లాడడం, దానికి వ్యతిరేకంగా ఎంఐఎం నాయకులు నిజామాబాద్ కార్పొరేషన్ అనడంతో సమావేశ ప్రాంగణంలో యుద్ధ వాతావరణం ఏర్పడిందని అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బయటకు ఇందూరు అని మాట్లాడుతూనే.. తన లెటర్ ప్యాడ్ లో మాత్రం నిజామాబాద్ అని ప్రచురించుకోవడం జరిగింది.. దీన్ని ప్రజలు గమనించాలని కోరారు.కేవలం ఎన్నికల వేళ గొడవ చేయాలని చూస్తున్న బీజేపీ నాయకులు ఇదే అదునుగా చూసి ఇందూరు అంటూ కపట నాటకాలు ఆడటం పక్కనపెట్టి బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిజంగా తన మాటకు కట్టుబడి ఉంటే ముందుగా తన లెటర్ ప్యాడ్ మార్చుకొని మాట్లాడాలి అని సవాల్ విసిరారు.



హిందూ, ముస్లిం మత ఘర్షణలు సృష్టించే ప్రయత్నం..

బీజేపీ జిల్లా అధ్యక్షుడు విలేకరులతో మాట్లాడుతూ.. షబ్బీర్ అలీ కొడుకు ఇలియాస్‌ను మేయర్ చేయాలని చూస్తున్నారు అని చెబుతూ నిజామాబాద్‌లో హిందూ, ముస్లిం మత ఘర్షణలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అసలు నిజామాబాద్ లో ఓటు లేని ఇలియాస్‌కు నిజామాబాద్‌లో ఏవిధంగా పోటీ చేస్తాడో, ఏ విధంగా మేయర్ అవ్వడానికి సాధ్యమవుతుందో బీజేపీ జిల్లా అధ్యక్షుడే తెలియజేయాలని అన్నారు. ఇలా సాధ్యమవ్వదని తెలియకపోవడం దినేష్ అవివేకం అని.. ప్రస్తుత మేయర్ రిజర్వేషన్ బీసీ మహిళ ఉంది ఒకవేళ మారితే నిజామాబాద్ మేయర్ రిజర్వేషన్ ఏది వస్తుందో తెలియకముందే షబ్బీర్ అలీ కొడుకు మేయర్ అంటూ మీరు ఏ విధంగా అంటున్నారో మీ విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు.

## బీజేపీ నేత నవనీత్ కౌర్‌కు అసదుద్దీన్ కౌంటర్




ముంబై: బీజేపీ నేతలు, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మధ్య మరోసారి మాటల యుద్ధం నడిచింది. ఇటీవల మహారాష్ట్ర బీజేపీ నేత నవనీత్ రాణా చేసిన వ్యాఖ్యలకు హైదరాబాద్ ఎంపీ అసుదుద్దీన్ ఒవైసీ కౌంటరిచ్చారు.కుటుంబంలో పిల్లల్ని కనడం అనే అంశంపై ఇరు నేతల మధ్య విమర్శలపర్వం కొనసాగింది. మీకు నచ్చిన విధంగా పిల్లల్ని కనండి. మిమ్మల్ని ఎవరు ఆపుతున్నారు అని ఒవైసీ తాజాగా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. అంతకుముందు బీజేపీ నేత, మాజీ ఎంపీ నవనీత్ కౌర్ ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ..:కొంతమంది అధికంగా సంతానాన్ని ఉత్పత్తి చేస్తూ హిందుస్థాన్‌ని పాకిస్థాన్‌లా మార్చాలని ప్రయత్నిస్తున్నారు. దానిని అడ్డుకోవాలంటే హిందువులు సైతం తప్పనిసరిగా ముగ్గురు, నలుగురు పిల్లలని కనాలి. నేను అందరు హిందువులకు ఇదే విజ్ఞప్తి చేస్తున్నాను. వీళ్లంతా నలుగురు భార్యలు,19 మంది పిల్లలు అని బహిరంగంగా చెప్పుకుంటారు. వారంతా మౌలానానా, మరోకరా అనేది నాకు తెలియదు. కానీ వారంతా అధికమంది పిల్లలను కనడం ద్వారా హిందుస్థాన్‌ని పాకిస్థాన్‌లా మార్చాలనుకుంటున్నారు. కనుక మనం కూడా ఒక్కరితో సంతృప్తి చెందకూడదు. తప్పనిసరిగా ఎక్కువ మంది పిల్లలని కనాలిః అని ఆమె అన్నారు. దీంతో, ఆమె వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి.తాజాగా ఆమె వ్యాఖ్యలపై ఎంపీ అసుదుద్దీన్ స్పందించారు. ఈ క్రమంలో అసద్ మాట్లాడుతూ.. ఆమె వ్యాఖ్యలకు పరోక్షంగా కౌంటరిస్తూ మాట్లాడారు. మహారాష్ట్ర లో ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లలుంటే పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులు కాదు. ఇదివరకూ ఈ నియమం తెలంగాణలో కూడా ఉండేది కాని ఇప్పుడు రద్దు చేశారు. నాకు ఇప్పుడు ఆరుగురు పిల్లలున్నారు. మీరు కూడా నలుగురిని కనండి మిమ్మల్ని ఎవరు అడ్డుకున్నారుః అని వ్యాఖ్యలు చేశారు. దీంతో, ఇరువురు నేతల మధ్య మాటల యుద్ధం మొదలైంది.

## సంపాదకీయం

బుధవారం 07-01-2026

# ఇండోర్ ఘటన కనువిప్పుకావాలి

ఏమాత్రం ఆలోచన ఉన్నవారైనా సరే, మంచినీళ్ల పైప్‌లైన్ మీద మరుగుదొడ్డి కడతారా? ఇంటింటికీ సరఫరా అయ్యే నీటిలో మురుగు నీరు వచ్చిన కలుస్తుంటే అధికారులు ఏం చేస్తున్నట్లు? అలా కట్టిన మరుగుదొడ్డి గుంత నుంచి పెల్లుబికిన వ్యర్థ జలాలు, ఆ టాయిలెట్ కింద నుంచి వెళ్తున్న ప్రధాన తాగునీటి పైప్‌లైన్‌లో కలవడంతో ఇండోర్‌లో విషాదాన్ని మిగిల్చింది. జీవితాన్ని సంతోషంగా గడపాలంటే ముందు ఆరోగ్యం బాగుం డాలి. ఊరికే జబ్బు పడకూడదంటే జనావాసాల్లో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా ఉండడంతో పాటు ప్రతిఒక్కరూ సురక్షితమైన తాగునీటికి నోచుకోవాలి. ఈ రెండు కరువైన చోట రోగాలు విజృంభించి అకా ల మరణాలకు మూలమవుతాయి. మన దేశంలో చాలా మందికి కనీసం మంచినీరు అందించలేని పరిస్థితుల్లో చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఉండడం ఆలోచించాల్సిన విషయం. ఒక పక్క భారత్ త్వరలో ప్రపంచంలోనే అతిపెద్ద మూడో ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుంది అని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ సరైన తాగునీటి కోసం కొట్లాడుతున్న పరిస్థితి కానీ, తాగునీటికి సరైన వసతి లేని గ్రామాలు, పట్టణా లు ఇప్పటికీ దేశంలో చాలానే ఉన్నాయి. దేశంలో దాదాపు ప్రతీ ఏటా 37.7 మిలియన్ల మంది నీటి సంబంధించిన వ్యాధు లతో కాలగర్భంలో కలిసిపోతున్నట్లు తెలుస్తోంది. సగటున దేశంలో రోజూ 585 మంది కలుషిత నీరు తాగడం వలన, నీటి సంబంధించిన వ్యాధులతో మరణిస్తున్నారు అని పలు నివేదికలు పేర్కొంటు న్నాయి. ఇటీవల కాలంలో మహారాష్ట్ర, కర్ణాటక, కేరళలో వరుసగా కలుషిత నీటి ఉదంతాలు చోటుచేసుకోగా తాజాగా స్వచ్ఛ నగరంగా పేరు పొందిన ఇండోర్‌లోని భగీరథ్‌పుర ప్రాంతంలో కలుషిత నీరు తాగడం వల్ల సుమారు 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. ప్రజల ప్రాణాలకు కలుషిత వ్యర్థాలతో ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా చూసే బాధ్యత ప్రభుత్వాలేదనని గుర్తు చేస్తూ ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధి సభ 2010లో స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన పరిసరాలను మానవ హక్కుల్లో అంతర్భాగంగా గుర్తించింది. కానీ నిర్లక్ష్యంలో తేలియాడుతున్న అధికార యంత్రాంగం కారణంగా వ్యక్తిగత, గృహావసరాలకు తగినంత మంచినీటిని నిరం తరం పొందే హక్కు జన భారతానికి ఉన్నా లేనట్లుగానే అనిపిస్తున్నది. వరుసగా ఎనిమిదేళ్లపాటు దేశంలోనే శుభ్రమైన నగరంగా పురస్కారాలు పొందిన ఇండోర్‌లోనే పరిస్థితి ఇలా ఉంటే.. చెత్త, మురుగునీటికి ఆవాసాలుగా పేరు పడ్డ హైదరాబాద్, విజయవాడ, వైజాగ్, తిరుపతి, తదితర నగరాల పరిస్థితి ఏమిటనేది ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది. ఏటా 3.77 కోట్ల మంది భారతీయులు కలుషిత నీళ్లలో నుంచి పురుడు పోసుకునే జబ్బుల బారినపడుతున్నారు. 15 లక్షల మంది పిల్లలు డయేరియాతో చనిపోతున్నారు. జల కాలుష్యంతో ప్రజల అనారోగ్యం దెబ్బతింటుండడంతో దేశం ఏడాదికి 7.3 కోట్ల పనిదినాలను నష్టపోతుంది. దానివల్ల భారత్‌కు సంవత్సరానికి 60 కోట్ల డాలర్ల ఆర్థిక నష్టం సంభవిస్తోంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ నేటికీ అందరికీ కనీసం విద్య, వైద్యం అందుబాటులో లేదు. అక్షరాస్యత అంతంత మాత్రంగానే ఉంది. ఇక మహిళల్లో బహు తక్కువ అక్షరాస్యత ఉన్న మాట వాస్తవం. దేశంలో చాలా రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థ 'లిక్కర్ కిక్' పైనే ఆధారపడి ఉండడం చాలా దురదృష్టకరమైన విషయం. ఏ ప్రభుత్వాలైన ఆ రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని కోరుకోవాలి. కానీ మన ప్రభుత్వాలు ముఖ్యంగా పండగ వేళల్లో, ప్రత్యేక రోజుల్లో మద్యం ఎక్కువగా ఉత్పత్తి చేయడంతో పాటు ఆ మద్యాన్ని బాగా సేవించి, ప్రభుత్వాలకు ఆదాయం పెరగడానికి వీలుగా టైం పొడిగింపు ద్వారా ఎక్కువ మంది తాగుబోతులును తయారు చేసే ప్రయత్నం జరుగుతున్నది. తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలి. దేశం అభివృద్ధి, ఔన్నత్యం ఆ దేశ ప్రజల నైపుణ్యాలపైన ఆధారపడి ఉంటుంది.. ఉత్పత్తి రంగంలో, సేవా రం గాల్లో ప్రజలు పాలుపంచుకోవడం ద్వారా దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుంది... మన పాలకులు కలలు కంటున్న వికసిత్ భారత్ సాధ్యం కావాలంటే, ప్రభుత్వాలు ప్రజల కనీస అవసరాలు తీర్చుకోవడానికి అవసరమైన విద్యను అందించాలి.. వైద్య రంగా న్ని బలోపేతం చేయడానికి సన్నాహాలు చేయాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. వలసలు తగ్గించాలి.. ఓటు బ్యాంకు రాజకీయాలు మానాలి. ఎప్పుడూ ప్రభుత్వాలు ఇచ్చే ఉచిత, సంక్షేమ పథకాలుపై ఆధారపడి బతికే జీవితాల నుంచి బయట పడేందుకు చర్యలు చేపట్టాలి. ఆ విధంగా ప్రభుత్వాలు ప్రజల జీవన స్థాయి మెరుగు పరిచే ఆశయాలను రూపొందించుకుని, ప్రతీ నూతన సంవత్సరం నూతన విధానాలు ద్వారా ప్రజల తలసరి ఆదాయం పెరగడానికి కొత్త కొత్త ప్రాజెక్టులు రూపొందించి వాటిని అమలు చేయాలి. ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టే కలుషిత వ్యర్థాలకు చెక్ పెట్టే ప్రయత్నం జరగాలి. అదే సమయంలో ప్రజలు కూడా ప్రభుత్వాలు ఎలా పనిచేస్తున్నా యో, ఏ లక్ష్యం కోసం తహతహలాడుతున్నారో అర్థం చేసుకోవాలి. ప్రఖ్యాత రష్యా నాయకుడు లెనిన్ చెప్పినట్లు 'పాలకుల వ్యూహాలు గ్రహించలేనంత వరకు ప్రజలు మోసపోతూనే ఉంటారు' అనే విషయం ఇకనైనా మన ప్రజలు అర్థం చేసుకోవాలి. ప్రజలను రకరకాల కార్యక్రమాలు ద్వారా మభ్యపెడుతున్న ప్రభుత్వాలకు తగిన రీతి లో ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలి. నేటి పాలకులకు, ప్రభుత్వాలకు తగిన రీతిలో ప్రజలు గుణపాఠం నేర్పడమే మన గురుతర బాధ్యత అని ప్రజలు, జెన్ జెడ్ యువత గ్రహించాలి.

# పిపిపి ఉచ్చులో వైద్య కళాశాలలు

న్యూఢిల్లీ,మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ.. ప్రభుత్వం తప్పు చేస్తోందా? ఆత్మరక్షణలో పడిందా! పిపిపి విధానం ప్రజల్ని ఒప్పించలేక పోయిందా?. ఒక కోటి నాలుగు లక్షల పదకొండు వేల నూట ముప్పై ఆరు మంది ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రభుత్వ మెడికల్ కాలేజెస్ ముద్దు.. ప్రైవేటైజేషన్ వద్దు.. అని చేసిన సంతకాలు గవర్నర్ చెంతకు చేరడం అనేది ఒక ఉద్యమ విజయం. ఒక చరిత్ర. కూటమి ప్రభుత్వానికి ఒక చెంపపెట్టు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెనుకకు తీసుకోవాలి. లేదంటే ఇది ఒక పెద్ద ప్రజా ఉద్యమంగా ప్రజలే ఉద్యమ నాయకులుగా ఒక ప్రభంజనాన్ని సృష్టిస్తుంది. రాజకీయాలకు అతీతంగా ప్రజా నిర్ణయాన్ని పాలకులు గౌరవించాలి. వివరాలు లోకి వెళ్తే, ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం సుమారు 32 నుండి 39 వరకు మెడికల్ కాలేజీలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ, ప్రైవేట్, డీమ్డ్ కాలేజీలు కలిసి ఉన్నాయి. సుమారు 19 ప్రభుత్వ, 19 ప్రైవేట్ కాలేజీలు ఉన్నాయి. మొత్తం ఎంబిబిఎస్ సీట్లు 5585 వరకు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ కళాశాలల్లో 2485, ప్రైవేట్ కళాశాలల్లో 3100 సీట్లు ఉన్నాయి. ఈ కళాశాలలన్నీ నీట్-యుజి (ఎన్ఇఇటియుజి) ద్వారా ప్రవేశాలు కల్పిస్తాయి, రాష్ట్ర కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా ఉంటాయి. 1923లో ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రారంభం నుంచి 2019 వరకు రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజెస్ కేవలం 12 మాత్రమే ఉన్నాయి. ఈ నేపథ్యంలో తమ ప్రాంతంలో ప్రభుత్వ మెడికల్ కాలేజెస్ ఉండాలి అనే తీవ్రమైన ఆకాంక్షలు, అవసరాలు ప్రజలలో ఉన్న కారణంగా 60% కేంద్రం, 40% రాష్ట్రం ఖర్చులను భరిస్తూ, నీతిఆయోగ్ ఇచ్చిన పిపిపి విధానాన్ని ఇతర రాష్ట్రాలు కొన్ని ఆచరించినా, గత ప్రభుత్వం పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో 17 కొత్త మెడికల్ కళాశాలలు ఉండాలి అనే ఒక ఉద్దేశంతో నిర్మాణానికి పూనుకొన్నది. రూ. 8500 కోట్లకు గాను దాదాపు రూ. 3500 కోట్లు నిధులు నాబార్డ్, ఇతర అనేక సంస్థల నుంచి నిధులు సమీకరించి 2021లో ప్రారంభించారు. ఏడు కాలేజీలు నిర్మాణం పూర్తి అయ్యి 5 కాలేజీల్లో అడ్మిషన్లు ప్రారంభించిన వైనం తెలుసు. దీనితో 750 సీట్లు పెరిగాయి. మిగతా 2 కాలేజీలు పులివెందులకు 50, పాడేరుకు 50 సీట్లు ఎన్ఎంసి (నేషనల్ మెడికల్ కౌన్సిల్) కేటాయించగా పులివెందుల సీట్లను నిరాకరిస్తూ స్వయంగా రాష్ట్ర ప్రభుత్వమే ఎన్ఎంసికి లేఖ రాసింది. ఇది ఎక్కడి న్యాయం. అసలు ఇపుడు ఎందుకు ఈ చర్చ పిపిపి పద్ధతిలో మెడికల్ కాలేజెస్ నడపాలన్న నిర్ణయాన్ని ఎందుకు వ్యతిరేకించాలి? ఎందుకు ప్రజా ఉద్యమంగా మారుతున్నది? ప్రభుత్వం ఆత్మరక్షణలో ఎందుకు పడుతోంది?ఆరోగ్య రంగంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలకున్న వ్యూహాత్మక అవసరాన్ని, కొవిడ్ సమయంలో కార్పొరేట్ దోపిడీ ఎంతలా పేద బతుకుల్ని చిదిమేసిందో అర్థం చేసుకొంటే నిధులు లేవనే కారణం చూపి ఇలాంటి నిర్ణయానికి ఒడిగట్టదని విజ్ఞుల అభిప్రాయం. కారణం మన రాష్ట్ర సంవత్సర బడ్జెట్ రమారమీ రూ. 3 లక్షల 20 వేల కోట్లు, అమరావతి నిర్మాణానికి ఇప్పటికి సేకరించిన రుణాలు దగ్గరగా రూ. 70 వేల కోట్లు, ఇంకా రెండవ భూసేకరణకు ఇంన్ని కోట్లు వెచ్చిస్తారో తెలీదు. ఇంకో రూ. 5 వేలు కోట్లు. అది కూడా ఒకసారి కాదు సంవత్సరానికి రూ. 500 కోట్లు పెడితే ఎన్ఎంసి పర్మిషన్ వున్న, 56 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం మొదలయి ఉన్న మిగతా 10 మెడికల్ కాలేజెస్‌ని సునాయాసంగా పూర్తి చెయ్యవచ్చు. ఈ పది మెడికల్ కాలేజెస్ పూర్తి అయితే ఇంకో 1500 నుంచి 2000 వేల మెడికల్ సీట్లు అందుబాటులోకి వస్తాయి. 17 మెడికల్ కాలేజెస్‌ని పెట్టిన విధానం చూస్తే చాలా వెనుకబడిన ప్రాంతాలను కలుపుతూ ప్రతి 50 కి.మీ.కి ఒక మెడికల్




కాలేజ్, ఒక చైన్ మోడల్‌గా రూపకల్పన చేసారు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ ఒక మోడల్ హబ్‌గా అనేక నూతన వైద్య పరిశోధనలకు నిలయంగా మారుతుంది.దాదాపు 30 వేలమందికి ఉద్యోగాలు వస్తాయని అంచనా. ఈ ఉద్యోగాలులో అన్ని తరగతుల వారికీ రిజర్వేషన్ వర్తిస్తుంది. అంతేకాదు దీనికి అనుబంధంగా ఉన్న హాస్పిటల్‌లో పేదలకు పూర్తిగా ఉచిత వైద్యం, 650 పడకల ఆసుపత్రి ఎంతో సేవలకి నిలయం అవుతుంది. ఇంతటి విలువైన ప్రజాధనాన్ని, ఆస్తులను ప్రైవేట్ వారికి అతి చవకగా అంటే ఎకరాకి సంవత్సరానికి వంద రూపాయలు చొప్పున 66 ఏళ్లకి లీజుకు ఇవ్వడమే కాదు, రెండు ఏళ్ళు జీతాలు కూడా ప్రభుత్వం భరిస్తుందని చెప్తున్నారు. ఈ పరిస్థితుల్లో, నిర్మాణ దశలో ఉన్న కాలేజీలను పూర్తి చెయ్యకుండా మొత్తం పది (ఆదోని, మదనపల్లి, మార్కాపురం, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురంలలో. మొదటి విడతలో మార్కాపురం, ఆదోని, మదనపల్లి, పులివెందుల కాలేజీలను 251.69 ఎకరాలను కేవలం వంద రూపాయలుకు లీజుకి ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేట్, పార్టనర్‌షిప్ పద్ధతిలో సిద్ధం అయింది. అంటే ప్రజలు ఇచ్చిన భూములు, ప్రభుత్వ నిధులతో నిర్మించిన వాటిని 100% ప్రైవేట్ వారికి లాభాలు చేకూర్చాలని ఆరాట పడుతుంది.

### గత అనుభవాలు ఏమి చెప్తున్నాయి?

గతంలో ప్రభుత్వ భూములు తీసుకొని కట్టిన మెడికల్ కాలేజ్ యాజమాన్యాలు మొదట ప్రభుత్వంతో చేసుకొన్న ఒప్పందాలు ఏమాత్రం అమలు చేయలేదని 1995లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కమిటీ నిగ్గుతేల్చి ఇచ్చిన నివేదికను ఇక్కడ మనం గుర్తు చేసుకోవాలి. చిత్తూరు మెడికల్ కాలేజీని అపోలోకి అప్పగిస్తే అది ఇపుడు అపోలో మెడికల్ కాలేజీగా మారి పూర్తి ప్రైవేటుపరం అయిందనే విషయం గుర్తుపెట్టుకోవాలి. గత ప్రభుత్వం ఇచ్చిన జిఒ 107, 108 ప్రకారం 50% సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్‌గా ఇచ్చి మేనేజ్‌మెంట్ కోటా సీటుకి రూ. 12 లక్షలు, ఎన్ఆర్ఐ సీటుకి రూ. 20 లక్షలు వసూలు చేస్తున్నారని నాడు ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం జనసేన వ్యతిరేకించాయి. అధికారం లోకి వచ్చిన 100 రోజుల్లో జిఒ రద్దు అని ప్రతి మీటింగ్‌లో చెప్పారు. ఇపుడు అధికారం చేపట్టిన 18 నెలల్లో 100% ప్రైవేటీకరణ చేయడం అంటే ప్రజలను, రాష్ట్రాన్ని మోసం చెయ్యడమే. ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ, మధ్యతరగతి పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు తీవ్రనష్టం జరుగుతుంది. భవిష్యత్తులో ఈ పిపిపి మెడికల్ కాలేజీల మొత్తం నిర్వహణ ప్రైవేట్ భాగస్వాముల చేతుల్లోనే ఉంటుంది. విద్యార్థుల హాస్టళ్ల మెస్ సౌకర్యాలు కూడా ప్రైవేట్ వ్యక్తుల అధీనంలో ఉంటాయి. అనుబంధ ఆసుపత్రుల్లో 70% పేదవారికి 30% ఇతరులకు అని చెప్తున్నా చివరికి మొత్తం వాణిజ్య పరమైన కార్పొరేట్ విధానం అమల్లోకి వస్తుంది.

# అభివృద్ధి ఫలాలు ..అందరికీ అందాలి



హైదరాబాద్,దశాబ్దాల స్వాతంత్ర్య పోరాటం తర్వాత ఆంగ్ల జాతి నుండి ముక్తి పొందిన భారతదేశం నేటికీ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నది. ఆసియా ఖండంలో అత్యంత సిరిసంపదలున్న భారతదేశంలో పరాయి మూకల దౌర్జన్యాలతో, దండయాత్రలతో అపారమైన వనరులు కొల్లగొట్టబడ్డాయి. కులమతాలను రెచ్చగొట్టిన బ్రిటీషు పాలకులు దేశం వదలి పారిపోయినా వారి అవశేష జాడ్యాలు మనల్ని వదలడం లేదు. అవినీతి, పేదరికం, ఉగ్రవాదం, మేధావుల విదేశీవలస మన ప్రగతికి ప్రతిబంధకంగా మారాయి. అన్ని అవరోధాలను దాటుకుంటూ, గమ్యంలో ఎదురయ్యే ముళ్ళపొదలను ఒక్కొక్కటిగా పెకలించుకుంటూ భారత్ అభివృద్ధి వైపు పయనం సాగించడానికి ప్రయత్నం చేస్తున్నది. కులమతాల వైషమ్యాలు, భాషా దురభిమానాలు, ప్రాంతీయతత్వాలు భరత జాతి గుండెను కుదుటపడనీయడం లేదు. శత్రుశేషం పొంచి ఉంది. సరిహద్దు భద్రత ఇంకా ప్రమాదంలోనే ఉంది. అయినా మన త్రివిధ దళాల తెగువ, ధైర్యసాహసాలు మన ప్రశాంత జీవనానికి మార్గం సుగమం చేసాయి. దేశ విభజన భరతమాతకు తీరని వ్యథను మిగిలించగా, బంగ్లా విమోచనం మన దాయాది దేశపు పగను మరింత జ్వలింప చేసింది. ఉగ్రవాదాన్ని పెంచి పోషించిన 'పాక్ణ అంతర్జాతీయంగా అభాసుపాలై, ఒంటరిగా మిగిలినా తన దుశ్చర్యలకు పదునుపెడుతూనే ఉంది. పహల్గాం దమనకాండ తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తో పాక్ తన ధోరణి మార్చుకుంటుందని ఆశించడం అత్యాశే కాగలదు. ఇటీవలికాలంలో అమెరికా అధ్యక్షుడు భారత్‌పై అక్కసు పెంచుకోవడం, ప్రతీకార సుంకాలతో భారత్‌ను దెబ్బతీయాలని ప్రయత్నించడంతో భారత్ చైనాకు దగ్గరవుతుందన్న సూచనలు కనిపించినా, ఇది ఆచరణ సాధ్యం కాదు. చైనా తన వక్రబుద్ధితో మన ఈశాన్య రాష్ట్రాలను కబళించాలనే 'డేగకన్ను'తో నిరంతరం మనపై ద్వేషాన్ని వెళ్ళగక్కుతున్నది. భద్రతా మండలిలో మన దేశానికి శాశ్వత సభ్యత్వం రాకుండా మోకాలడ్డుతున్నది. పాకిస్తాన్‌కు సమీప భవిష్యత్తులో తీవ్రనష్టం వాటిల్లనున్నా కేవలం మన దేశం మీదున్న గుడ్డి ద్వేషంతో పరాయి దేశాలవెంట పరుగెడుతున్నది. దాయాది దేశం తన కంటిని తానే పొడుచుకోవడానికి సిద్ధమవుతున్నది. బంగ్లాదేశ్ విమోచనంలో మనమెంత సహాయపడినా ఆ దేశం తిరిగి పాక్ విషపరిష్వంగంలో సేద తీరుతున్నది. అయినా భారత్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని నిలబడగలుగుతున్నది. దేశం విద్య, వైద్య, ఆరోగ్య, శాస్త్ర సాంకేతిక రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించింది. ఎంతగా దేశం అభివృద్ధిని సాధించినా, అభివృద్ధి ఫలాలు పెరిగిన ప్రజలకు అందడం లేదు. స్వాతంత్ర్యానికి పూర్వం 39 కోట్లున్న భారత జనాభా నేడు 140 కోట్లకు చేరింది. పెరిగిన జనాభాకు సరిపడా ఆహారాన్ని, ఆవాసాన్ని కల్పించడం దేశానికి తలనొప్పిగా మారింది. ఇదే సందర్భంలో దేశానికి వెన్నెముక లాంటి వ్యవసాయ రంగం నిర్లక్ష్యనికి గురైనది. చదువుకున్న యువత విదేశీ వ్యామోహం వలన 'బ్రెయిన్ డ్రెయిన్ణ సమస్య కొనసాగుతూనే ఉంది. భారతీయ మేధస్సు ఉషస్సులు విదేశాలపై ప్రసరించడంవలన విదేశాలు అభివృద్ధిపథంలో సాగుతున్నాయి. మేధావుల వలసలను ఆపి, వారి మేధస్సుకు తగిన గుర్తింపు నిచ్చే చర్యలు ప్రారంభించకపోతే అది దేశానికే పెనుశాపంలా మారే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. సువిశాలమైన మన దేశంలో ఖనిజసంపదకూ, జలసంపదకూ, మానవ సంపదకూ లోటు లేనే లేదు. అయితే వీటి వినియోగమే సరిగాలేదు. అవినీతి అనే మహమ్మారి భారతీయ సామాజిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నది. వీటితో పాటు విద్య, వైద్య, ఆరోగ్య రంగాలలో చోటుచేసుకుంటున్న వినాశన కరమైన ధోరణి భావిప్రగతికి గొడ్డలిపెట్టు. వీటిని సరిదిద్దే చర్యలు చేపట్టాలి. భారతదేశంలో వనరులకు కొరత లేదు. అయినా అందరికీ కూడు, గూడు, గుడ్డ, విద్య, ఆరోగ్య వసతులను కల్పించలేకపోతున్నాం. అపారమైన జలసంపద ఉన్నా ఆ జలరాశిని వినియోగంలోకి తేలేకపోతున్నాం. నదుల అనుసంధానమే వృథగా కడలి పాలవుతున్న జలసంపద సద్వినియోగానికి ఏకైక మార్గం. నేటికీ దేశంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది పరిశుభ్రమైన త్రాగునీటికి నోచుకోలేక, రోగాల పాలవుతున్నారు. పారిశుద్ధ్య లోపం కొట్టొచ్చినట్టు కానవస్తుంది. సరైన త్రాగునీటి సదుపాయం లేదు. చాలా పాఠశాలల్లో ఈనాటికీ సరైన మౌలిక సదుపాయాలు, మరుగు దొడ్లు లేకపోవడంతో చాలా మంది బాలికలు చదువుకు దూరమవుతున్నారు. విద్యా వ్యవస్థను చక్కదిద్దే ముందు పాఠశాలల్లో కనీస సదుపాయాలను మెరుగుపరచాలి. విద్యావంతులు పెరుగుతున్నా, అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించలేకపోవడం మన అభివృద్ధికి శరాఘాతం. గతంలో మాదిరిగా మన దేశంలో సాంప్రదాయబద్ధమైన వృత్తులు లేవు. విద్యావంతులంతా ఉద్యోగ వేటలో పడిపోవడం వలన వ్యవసాయం రంగం అనాథలా మారిపోయింది. ప్రపంచమంతా ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొంటున్నా, భారతదేశం ఆర్థిక మాంద్యపు కోరలలో చిక్కకపోవడానికి ప్రధాన కారణం మనది వ్యవసాయిక దేశం కావడమే. ఏనాటికైనా మన దేశాన్ని జీవనాడి వ్యవసాయ రంగమే. శాస్త్ర సాంకేతిక రంగాలతోపాటు వ్యవసాయరంగాన్ని కూడా ఇతోధికంగా ప్రోత్సహించాలి. వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయడం తగదు. రైతన్న బ్రతుకులకు భద్రత కావాలి. వ్యవసాయ రంగంతో పాటు భావిభారతాన్ని సుశోభితం చేసే విద్యారంగాన్ని మెరుగు పరచాలి. మొత్తం విద్యారంగాన్ని ప్రభుత్వమే నడపాలి. ధనిక, పేద అనే తారతమ్యంలేకుండా అందరికీ సమానమైన విద్యావకాశాలు రావాలి. అన్ని స్థాయిల్లోను విద్యను అందరికీ అందుబాటులోకి తేవాలి. ఉచిత విద్యను అందించాలి. భారతదేశం ప్రగతిపథంలో ముందుకు దూసుకుపోవాలంటే అవినీతి జాడ్యం అంతరించాలి. ఇది నా దేశం అనే భావన ప్రతీ ఒక్కరిలో నరనరాన జీర్ణించుకుపోవాలి. శతకోటి దరిద్ర్యాలకు అనంత కోటి ఉపాయాలున్నట్టు దేశంలోని సమస్యలన్నింటికీ మార్గాన్వేషణ చేయాలి. సంకుచిత భావాలు, స్వార్థచింతన కొంత మేరకు కట్టి పెట్టి దేశహితం కోసం పాటుపడాలి.

# మందు బాబులకు రైతు షాక్...

మెదక్, మెదక్ జిల్లా రైతు ఆనంద్ తన మామిడి తోటను 'మందుబాబుల' బారి నుంచి కాపాడుకోవడానికి సంచలన నిర్ణయం తీసుకున్నారు. తోటలో మద్యం తాగితే 25 చెప్పుదెబ్బలు, రూ. 5,000 జరిమానా విధిస్తామని హెచ్చరిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ వినూత్న హెచ్చరిక సోషల్ మీడియాలో వైరల్ అయింది.సాధారణంగా తోటల్లోకి పక్షులు, జంతువులు రాకుండా రైతులు కాపలా కాస్తారు. కానీ మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన రైతు ఆనంద్ మాత్రం 'మందుబాబుల' బారి నుంచి తన మామిడి తోటను కాపాడుకోవడానికి ఒక సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన తోటను మద్యం తాగే స్థావరంగా మార్చుకున్న వారిని హెచ్చరిస్తూ ఆయన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆనంద్‌కు నర్సాపూర్ ప్రధాన రహదారి పక్కనే మామిడి తోట ఉంది. నర్సాపూర్ పట్టణంలో మద్యం కొనుగోలు చేసే కొందరు వ్యక్తులు, దారి పక్కనే ఉన్న ఈ తోటను తమ 'బార్'గా మార్చుకున్నారు. చెట్ల నీడన కూర్చుని హాయిగా మద్యం సేవించడమే కాకుండా, వెళ్లేటప్పుడు ఖాళీ సీసాలను తోటలోనే పగలగొట్టి వెళ్తున్నారు. అలాగే తిన్న పదార్థాల వ్యర్థాలను డిస్పోజబుల్ ప్లేట్లు, గ్లాసులు తోట నిండా పడేసి అపరిశుభ్రం చేస్తున్నారు.మందుబాబులు పగలగొట్టిన గాజు ముక్కల వల్ల తోటలో పనిచేసే కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిందెలు చూడటానికి, నీళ్లు పెట్టడానికి వెళ్లే కూలీల కాళ్లకు ఈ సీసా పెంకులు గుచ్చుకుని పలుమార్లు రక్తగాయాలయ్యాయి. ఎన్నిసార్లు చెప్పినా, బతిమిలాడినా మందుబాబుల ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఆనంద్ విసిగిపోయారు. శాంతితో చెప్పినప్పుడు వినని వారికి 'సామ దాన భేద దండోపాయాలు' వాడాలని నిర్ణయించుకున్న ఆనంద్.. తన తోట చుట్టూ భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అందులో ఆయన రాసిన మాటలు చూసి మందుబాబుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.'ఇక్కడ మామిడి చెట్లలో మద్యం తాగరాదు. తాగినచో వారికి 25 చెప్పుదెబ్బలు.. అలాగే రూ. 5,000 జరిమానా విధించబడును' అని ఆ బ్యానర్‌లో స్పష్టంగా హెచ్చరించారు. ఈ వినూత్న హెచ్చరికను చూసిన స్థానికులు దాన్ని ఫోటో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో అది కాస్తా వైరల్ అయ్యింది. నెటిజన్లు ఈ రైతు ధైర్యాన్ని అభినందిస్తున్నారు. అన్నదాత ఆవేదనను అర్థం చేసుకోవాలి.. తోటలు పార్టీలకు వేదికలు కావు అంటూ పలువురు కామెంట్లు పెడుతున్నారు. మరి ఈ ఘాటు హెచ్చరిక తర్వాతైనా మందుబాబులు తమ పద్ధతి మార్చుకుంటారో లేదో వేచి చూడాలి.

# 40మంది పౌరుల మృతి

వాషింగ్టన్, వెనెజువెలాపై అమెరికా సైన్యం చేసిన దాడిలో కనీసం 40 మంది ప్రాణాలు కోల్పోయినట్లుగా వెనెజువెలాకు చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. మృతుల్లో సైనికులతో పాటు సాధారణ పౌరులు కూడా ఉన్నారని చెప్పారు. వెనెజువెలాపై భారీ దాడి అనంతరం అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన సతీమణి సిలియా ఫ్లోరెస్‌ను అదుపులోకి తీసుకున్నట్లుగా పేర్కొన్నారు. కాగా, వెనెజువెలాపై చేసిన దాడిలో తమవైపు ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. కేవలం కొద్దిమంది మాత్రమే గాయపడ్డారని తెలిపారు. ఇది అత్యంత సంక్లిష్టమైన ఆపరేషన్ అని పేర్కొన్నారు. మనవైపు ప్రాణనష్టం లేకుండా ఇంత పెద్ద ఆపరేషన్ పూర్తి కావడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. ఈ దాడిలో అనేక విమానాలు, హెలికాప్టర్లు, ఫైటర్ జెట్లు పాల్గొన్నాయని వెల్లడించారు. సాధారణంగా చొరబడలేని ప్రాంతాల్లోకి ప్రవేశించి, ఈ క్లిష్టమైన ఆపరేషన్ నిర్వహించామని చెప్పారు. వెనెజువెలా ప్రజలకు స్వేచ్ఛ కల్పించడమే అమెరికా లక్ష్యమని ట్రంప్ స్పష్టం చేశారు.వెనెజువెలా దేశంపై దాడి చేసి అధ్యక్షుడు నికొలస్ మదురో, అతని భార్య సిలియా ఎ÷-లోరస్‌ను అగ్రరాజ్యం అమెరికా బందీగా పట్టుకుని న్యూయార్క్ నగరానికి తీసుకుపోయిన క్రమంలో ఆ దేశ రాజధాని కారకాస్, పొరుగున ఉన్న నగరాల్లో తీవ్ర భయం, ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి. ఆహారం కోసం పెద్దయెత్తున ప్రజలు బారులు తీరారు. పలు చోట్ల అంధకారం అలముకుంది. ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించింది. ఏ క్షణంలో ఏం జరుగుతుందో అన్న భయంతో చాలామంది ఇండ్లకే పరిమితమై పోయారు. చాలా సూపర్‌మార్కెట్లు మూతపడ్డాయి. తెరిచి ఉంచిన చిన్నచిన్న దుకాణాల వద్ద 500-600 మంది బారులు తీరారు. ముఖ్యంగా ముందు జాగ్రత్తగా బ్రెడ్ దుకాణాల వద్ద జనం పెద్దయెత్తున చేరుకున్నారు. అలాగే మందుల షాపుల వద్ద కూడా ప్రజలు ఎక్కువగా కన్పించారు. ఔషధాలతో పాటు అక్కడ అమ్మే కేన్‌డ్ ఫుడ్‌ను వారు కొనుగోలు చేయడం కన్పించింది. ప్రజలు తమ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల చార్జింగ్ కోసం ఎగబడ్డారు. కాగా, అక్కడ స్వల్ప సంఖ్యలో ఉన్న భారతీయ కమ్యూనిటీ కోసం భారత ఎంబసీ ఒక వాట్సాప్ గ్రూప్‌ను సృష్టించింది. దాని ద్వారా భారతీయులకు ఎప్పటికప్పుడు సూచనలు, ఆదేశాలు అందజేస్తున్నది. మెరికా దాడుల్లో పవర్ గ్రిడ్స్ దెబ్బ తినడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్తు లేక అంధకారం అలముకుంది. కమ్యూనికేషన్ వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అమెరికా దళాలు కారకాస్ ఎయిర్‌పోర్టుపై కూడా దాడి చేయడంతో రాజధాని నుంచి 100 కి.మీ వరకు ఎలాంటి వైమానిక ప్రయాణ సౌకర్యం లేకుండా పోయిందని భారత సంతతికి చెందిన సునీల్ మల్హోత్రా అనే స్థానికుడు తెలిపారు. ప్రజలు ఆహారం కోసం అల్లాడుతున్నారని, షాపుల వద్ద పెద్దపెద్ద క్యూలు ఏర్పడ్డాయని, పౌరుల్లో భయం, అనిశ్చితి, ఆందోళన నెలకొందని చెప్పారు. ఫ్యూర్టే ట్యూయనా వద్ద అధిక నష్టం వాటిల్లిందన్నారు. కాగా, విద్యుత్తు స్తంభాల నుంచి అక్రమంగా వైర్లను లాగి కొందరు ఫోన్లకు చార్జింగ్ చేసే వ్యాపారం ప్రారంభించారు. ప్రస్తుత పరిస్థితులపై స్థానిక సంస్థలు కానీ, ప్రభుత్వం కానీ ప్రజలకు ఎలాంటి ప్రకటనలు, సూచనలు చేయలేదు. అధికారులు కూడా పూర్తి అనిశ్చితి పరిస్థితుల్లో ఉన్నారు. అయితే అక్కడక్కడ పోలీసులు పరిస్థితులను నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పౌరులు బయటకు రావడానికే భయపడుతున్నారని మల్హోత్రా తెలిపారు.

# టెన్షన్ లో పయ్యావుల...

అనంతపురం,ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దగా యాక్టివ్ గా లేరు. ఆయనకు ఆర్థిక శాఖ అప్పగించడంతో పెద్దగా బయట కనపించడం లేదు. అలాగే విపక్షాల విమర్శలపై కూడా పయ్యావుల కేశవ్ పెద్దగా స్పందించడం లేదు. తన పని తాను చేసుకుపోతున్నారు. ప్రతి నెల మొదటి తారీఖు వచ్చే సరికి రుణాలు తీసుకు వచ్చే బాధ్యతతో పాటు అనేక రకాలమైన వత్తిళ్లతో ఆయన కొంత పాలనాపరంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిసింది. అందుకే పయ్యావుల కేశవ్ పెద్దగా గతంలో మాదిరిగా యాక్టివ్ గా లేరని అంటున్నారు. పయ్యావుల తాను చూసే శాఖకు తాను తగిన న్యాయం చేయలేకపోతున్నానన్న ఆవేదనను కూడా సన్నిహితుల వద్ద వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.కేశవ్ తెలుగుదేశం పార్టీలో ఓ సీనియర్ లీడర్. దశాబ్దాలుగా ఉమ్మడి రాష్ట్రంలోను పార్టీలో కీలక నేతగా ఎదిగారు. అయితే పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆయన ఓడిపోతుంటే పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయన విజయాలు సాధిస్తూ వస్తున్నారు. పయ్యావుల పార్టీ ప్రతిపక్షంలో ఉన్న 2004, 2009 ఎన్నికల్లో మాత్రం విజయం సాధించారు ఆయన 1999, 2014లో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు ఓడిపోయారు. 2014లో ఓడిపోయినా ఆయన ఎమ్మెల్సీ అయ్యారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో లేనప్పుడు పయ్యావుల కేశవ్ గొంతు బలంగా వినిపించేది.

